

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### హిడింబ గుడి - హిమాచలం ఒడి

**నవంబర్ తొమ్మిదన బయలుదేరి** ఢిల్లీ వెళ్ళాం. ప్రొద్దుట తొమ్మిదికల్లా ఎయిర్ పోర్ట్‌లోంచి బయట పడ్డాం. ఎదురుగా మాకు Make My Trip వాళ్ళు కుదిర్చిన డ్రైవర్ గౌరవ్ కనపడ్డాడు. Make My Trip వాళ్ళు ఒక ఏడ్ ఇస్తున్నారు. వాళ్ళ ట్రిప్ తర్వాత మనకు ఎమ్నీషియా వస్తుందిట. అక్కడ ఎంజాయ్ చేసిందే గుర్తుంటుంది తప్ప, పిల్లలూ, బాధ్యతలూ గుర్తుండవుట! ఇది చూసి మా అబ్బాయిలిద్దరూ గోల పెట్టారు. అయినా నేనూ మా ఆయనా ధైర్యంగా మనాలీ ట్రిప్‌కి బయలుదేరాం.

నాకు చిన్నప్పటినుండీ హీరో హీరోయిన్లు సినిమాల్లో మంచులో ఆడడం చూస్తే సరదాగా ఉండేది! మా అమ్మమ్మ నాకో ఎన్సైక్లోపీడియా. ఆవిడ్ని 'అది నిజంగా మంచేనా?' అని అడిగితే 'ఉట్టిదే! అదంతా సినిమావాళ్ళ కనికట్టు!' అనేది. లేకపోతే వేసవి శలవుల్లో ఎప్పటిలాగా తిరుపతో, రాజమండ్రినో కాకుండా హిమాచల్ ప్రదేశ్‌కి తీసుకెళ్ళమంటానని ఆవిడ భయం! మా అమ్మమ్మ నన్ను చాలా విషయాల్లో మాయ చేసిందని, నాకు పెద్దయ్యాక తెలిసింది. వేటగాడు సినిమా చూసి, "ఎన్.టి.ఆర్‌కి పెద్దపులు అంటే భయం వెయ్యదా? అలా ముట్టుకునీ, పట్టుకునీ ఏక్ట్ చేసాడేంటి?" అని ఆశ్చర్యంగా అడిగితే "అబ్బే అది నిజం పులి కాదు' కుక్కకి పులి చర్మం కడతారు!" అని బియ్యం రవ్వ విసురుతూ తేలిగ్గా చెప్పేసేది! కానీ పెద్దయ్యాక నేను సినిమా పరిశ్రమకి దగ్గరయి ఆవిడ మాటలు అబద్ధాలు అని తెలుసుకునే టప్పటికి, పైకి వెళ్ళిపోయి తెలివిగా తప్పించేసుకుంది.

సరే! మా రథచోదకుడు గౌరవ్ మమ్మల్ని మాటలతో, పాటలతో బోలెడు అలరిస్తూ మా యాత్ర రక్తి కట్టించాడు! ముఖ్యంగా గౌరవ్ నా హిందీని తెగ మెచ్చేసుకున్నాడు. (అటుపోయిన నెలే ఒక పాఠకుడు మీ సొంతడబ్బా లేని కాలమ్ చదివానని ఆనంద పడితే అబ్బే అదేం కుదరదు అని ఖచ్చితంగా చెప్పేసానుగా) దాంతో నేను రెచ్చిపోయి "గౌరవ్ ఇదర్ పార్కింగ్ కీ ప్రబంధ్ హైతో, ఏక్ బార్ గాడీ కో రోఖియే. ఏ సంభవ్ హై క్యా?" అని మాట్లాడితే, పడీ పడీ నవ్వేవాడు. పైగా తన హిందీ టీచర్ కన్నా మా హిందీ టీచర్ గట్టివాడు అని మెచ్చుకున్నాడు కూడా! అతను మంచి సంగీత పిపాసి. ఎన్నెన్నో సీడీలు కొని, మాకు పంజాబీ గాయకుల్ని పరిచయం చేస్తూనే ఉన్నాడు. దాన్ని బట్టి నాకు పంజాబ్‌లో ప్రతి ఇంట్లో ఒక గాయకుడూ, ప్లస్ కవీ ఉంటారని అర్థం అయింది. అందులో సర్తాజ్, పూజా ముఖ్యమైన వాళ్ళు. అతని పూర్తి పేరు గౌరవ్ ఉపాధ్యాయ్. నిష్ఠతో కూడిన బ్రాహ్మణుడు! ఎందుకైనా మంచిదని, సంగీత సాహిత్య చర్చలొస్తే మా ఆయన కాస్త దూరంగానే ఉండేవారు. అసలు కారు కదిలినప్పడినుండీ ఈయనకి ఆఫీస్ ఫోన్ రావడం, ఈయన అందులో మునిగిపోవడం మామూలైపోయింది! ఇంక నాకు మిగిలిన కాలక్షేపం మా గౌరవే పాపం!

అన్నా హజారే, అమితాబ్ కేబీసీతో మొదలుపెట్టి, రాందేవ్ బాబా, రాఖీ సావంత్ వరకూ నేనూ గౌరవ్ తీవ్రంగా చర్చించుకున్నాక, ‘వెల్ కమ్ టూ హర్యానా‘ అని గాలివార్త, ఖంగున మ్రోగింది! అంటే ఎయిర్ టెల్. ఇది మనం ఏ స్టేట్‌లోకి ఎంటర్ అయినా వెంటనే స్వాగతం చెప్పి, "ఇంక మామూలుగా నీ ధోరణిలో మాట్లాడేస్తే మాడు పగులుతుంది తారీఫ్ మారింది జాగ్రత్త!‘ అని హెచ్చరిస్తూంటుంది.

"ఇదర్ ఆప్‌కా లంచ్‌కా ప్రభంద్ హోగా" అని హవేలీ అనే రాజప్రాసాదం ముందు ఆపాడు గౌరవ్. నేను దాని అందానికి మాత్రం ముచ్చట పడుతూ దిగాను. జనం చాలామంది టాయ్ లెట్స్ మాత్రం ఉపయోగించుకుని, హోటల్‌కి వెళ్ళకుండానే వెళ్ళిపోతున్నారు. దానికి వాళ్ళు నొచ్చుకోకుండా, అవి మా హైదరాబాద్ ఆర్బిట్ మాల్ అంత నీట్‌గా మెయిన్‌టైన్ చేస్తూ, వాటికి హోటల్‌కి సంబంధం లేకుండా బయటకే ద్వారం పెట్టారు. హర్యానా ప్రజల హాస్పిటాలిటీకి నాకు తెగ ముచ్చటేసింది!

హోటల్ లోపలకి లంచ్‌కి వెళుతుంటే మా గౌరవ్ ‘దాల్ మఖానీ జరూర్ ఖాయియే.. డోంట్ మిస్ ఇట్‘ అన్నాడు.

మేం పూరీ ఉందా? అంటే సర్వర్ లేదన్నాడు. కానీ చుట్టూ అంతా పూరీలే తింటున్నారు. ఎన్ని సార్లు అడిగినా అలాగే అంటూంటే, మా ఆయన "పోన్లే వదిలేద్దాం" అన్నారు. కానీ నేను వదలకుండా పక్క టేబుల్ మీద చూపించి ‘అవి కావాలి‘ అన్నాను. ‘ఓ.. బటూరా" అని కోలగా ఉన్న అరిటాకంత పూరీలు తీసుకొచ్చాడు. గోధుమ పిండితో గుండ్రంగా వత్తి వేయిస్తే పూరీలు అనుకుంటాం మనం! దాల్ మఖానీ కూడా తెప్పించుకున్నాం. అది చాలా బావుంది. (ఎందుకు బావుండదూ? దానిలో బోలెడు మఖాన్ వేస్తాడు. మీరు అవి తినకూడదు. అని మా అశ్విన్ ఫోన్లో చెపుతూనే ఉన్నాడు. వాడు మాకిచ్చిన డయిట్ కార్న్‌ఫ్లాక్స్, మిల్క్, ఫ్రూట్స్, పుల్కా, దాల్ తడఖా మాత్రమే!)

మళ్ళీ ప్రయాణం మొదలైంది. మా ప్రభాకర్ శర్మగారు ఓ పని చేసొచ్చారు. ఆయన మా ఆయనలెండి! చార్జ్‌లో పెట్టి కెమేరా సెల్, ఛార్జర్ మరచిపోయి వచ్చారు. దాంతో నేను కెమేరా లేకుండా ఎలా? అని హర్యానా నుండీ అవి కొనడానికి వేట మొదలెట్టించాను అంబాలాలో ట్రై చేసాం. ఛార్జర్ ఉంది సెల్ లేదు. చండీ గఢ్ లో ట్రై చేసాం. సెల్ ఉంది ఛార్జర్ లేదు! ఈ లోగా మా ఐ ఫోన్స్ రెండూ లాక్ అయిపోయాయి. దాంతో మాకు బోలెడు కాలక్షేపం! అవి అన్‌లాక్ చెయ్యడానికి ఎవరికి తోచిన మార్గాల్లో వాళ్ళం ట్రై చేసాం. చండీగఢ్ దాటుతూండగా అవి అన్‌లాక్ అయ్యాయి. దాంతో అస్సలు కెమేరాలు అవసరం లేదు అనిపించేటన్ని ఫోటోలు తీసాం. దాంతో చార్జ్ అయిపోయింది.

చండీగఢ్‌లో లేక్ వ్యూ అనే పెద్ద హోటల్‌లో కెళ్ళి, సింగిల్ టీ తాగి ఇద్దరం ఫోన్లు చార్జింగ్ చేసుకున్నాం! పంజాబీస్ చాలా కష్టజీవులు. అందులో సర్దార్జీలు మరీను. సూటి ముక్కులతో ధ్రుఢంగా ఉండే వీళ్ళు ఎక్కువగా ఆటోమొబైల్స్ వ్యాపారంలోనే ఉంటారు. ఐదు నదులు పారే సుక్షేత్రమైన పొలాలూ, మంచి గాలితో ఆరోగ్యంగా అందంగా ఉంటారు అమ్మాయిలు. ముఖ్యంగా చెప్పుకోవలసింది వాళ్ళ సంప్రదాయాల్ని! ఎవరో కొత్తగా పెళ్ళైన జంట అనుకుంట హోటల్‌కి వచ్చారు. ఇంకో ఫ్యామిలీ ఆ హోటల్‌కి రాగానే, పలకరించి అందులో పెద్దలందరికీ పాద నమస్కారాలు చేసారు. వాళ్ళు నోరారా ఆశీర్వదించారు. **అలా పబ్లిక్ ప్లేసెస్‌లో పెద్దలనుండి పాదధూళి తీసుకోవడం మేం చాలా చోట్ల చూసాం.** ఇలా రెండు రాష్ట్రాల ముఖ్యపట్టణం అయిన చండీగఢ్ దాటి, సిమ్లా చేరేసరికి సాయంత్రం ఏడుగంటలయింది! కొండ ఎక్కడం మొదలు పెట్టగానే, చెంపకి ఛెళ్ళున కొట్టింది చలి! పారే వ్యాస్ నది



అందంగా మెలికలు తిరుగుతూ, కొండల్లోకి మాయం అవుతోంది. పంజాబీ వినిపించడం మానేసి, పహాడీ వినిపించసాగింది.

నేనూ గౌరవ్ రాజకీయాలూ, సినిమాలూ అయిపోయి ఏక్తాకపూర్ హిందీ సీరియల్స్‌లోకి వచ్చాం. అతనూ నేను చూసే సీరియల్సే చూడడం నాకు గొప్ప ఆనందాన్ని కలిగించింది. 'బడీ అచ్చీ లగ్ తీ హై' లో రాంకపూర్, నిజంగా భార్యని అనుమానిస్తున్నాడా? ప్రియని వదిలేస్తాడా?" అని గౌరవ్ చర్చిస్తూ ఉండగా మా ఆయన గట్టిగా ఆవలించారు. 'ఇతనికీ నాకూ అభిప్రాయాలు చాలా దగ్గరగా ఉన్నాయండోయ్!' అని చెప్దాం అని పక్కకి చూసేసరికి, ఆయన ముఖంలో భావాలు సీరియస్‌గా కనిపించాయి. ఎప్పుడూ ఇంతే! సీరియల్స్ అనగానే సీరియస్ అయిపోతారు. అందుకే తెలివిగా టాపిక్ మార్చాను. కాసేపు పుణ్యం పురుషార్థం అని నిత్యానంద స్వామీజీ, అగ్నివేష్ స్వామి బిగ్ బాస్ ప్రోగ్రాంకి వెళ్ళడం గురించి మాట్లాడుకున్నాం!


సిమ్లా కొండమీద ఇళ్ళు

సిమ్లా చాలా అందమైన ప్రదేశం. కొండమీద ఇళ్ళు పేర్చిన బొమ్మరిళ్ళులా ఉన్నాయి. మాకు ఇచ్చిన రాయల్ పార్క్ త్రి స్టార్ హోటల్‌లోకి అడుగు పెట్టేసరికి ఒక కొత్తగా పెళ్ళయిన జంట లాబీలో తమిళంలో మాట్లాడుకుంటూ కనిపించారు. మేనేజరూ, ఇంకో ఇద్దరు బోయ్స్, ఫుల్‌గా ఉలెన్ కోట్స్‌లో కవర్ అయి మా కోసం ఎదురుచూస్తూ ఉన్నట్లు కనిపించారు. మా ప్యాకేజ్‌లో బ్రేక్‌ఫాస్టు, ఇంకా డిన్నర్ ఇన్‌క్లూడెడ్! కానీ మేం డోమినోస్ దగ్గర ఆగి పిజ్జాలు తినేసాం గౌరవ్‌తో సహా. దాంతో డిన్నర్ వద్దు, బటర్ మిల్క్ పంపించమని చెప్పాం. గౌరవ్ అక్కడ దగ్గరలోనే ఉన్న తన బసకి వెళ్ళిపోయాడు.


బ్రేక్‌ఫాస్టు

సెకండ్ ఫ్లోర్‌లో రూం నెంబర్ టూ నాట్ ఫోర్ ఇచ్చారు. అందులో అన్నీ హిందీ ఛానెల్స్ (ముఖ్యంగా నేను కెబిసి, బిగ్‌బాస్ మిస్ అవలేదు) వచ్చాయి. చలి బాగానే ఉంది. మజ్జిగ తాగి, పన్నెండు గంటల జర్నీతో అలిసిపోవడం వల్ల బాగానే నిద్రపోయాం.



తెల్లవారి ఎనిమిదిగంటలనుండీ బ్రేక్ ఫాస్ట్ పెడతారు. మేం వెళ్ళేసరికి వాళ్ళు మాకోసమే ఎదురు చూస్తూ కనిపించారు.

'ఇంకెవరూ హోటల్ లో లేరా?' అని అడిగాను.

'ఇప్పుడు ఇంకా సీజన్ మొదలవలేదు మేడం. ఫిబ్రవరి, మార్చిలలో ఒక్క రూం కూడా దొరకదు' అని చెప్పారు.

ఫుడ్ మాత్రం చాలా రుచిగా ఉంది. మేం ఇంగ్లీష్ బ్రేక్ ఫాస్ట్ తీసుకున్నాం.

ఆ రోజు గౌరవ్ మమ్మల్ని కాల్కా తీసుకెళ్ళాడు. మా కారు ఒక దగ్గర ఆపి 'ఇంక వెళ్ళదు. మీరు గుర్రాల మీద వెళ్ళాలి' అన్నాడు.

ఒక అతను నా దగ్గరకొచ్చి బోలెడు సైగలతో బోలెడు సేపు చెప్పాకా, మా గౌరవ్ "మీకు సిమ్లా లోకల్ డ్రెస్‌లో ఫోటోలు తీస్తాడుట. తీయించుకోండి, మళ్ళీ ఎప్పుడొస్తారో!" అన్నాడు.

పైగా అవి పైనుండి పిన్స్ పెట్టి మాత్రమే తగిలిస్తా అనడంతో మా ఆయన ఒప్పేసుకున్నారు. కాసేపు అతను ఎలా నిలబడమంటే అలా నిలబడి, కాళ్ళూ చేతులూ అతని ఇష్టం మేరా కదిపాం! పది ఫోటోలు ఆరువందలు అని చెప్పి, ఒకటి గిఫ్ట్‌గా మా నార్మల్ డ్రెస్‌తో తీసాడు. సాయంత్రం హోటల్‌లో అందచేస్తాడు.

"మీరు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చారంటే అస్సలు ఎవరూ నమ్మరు. అంత బాగా సూట్ అయ్యారు" అని గౌరవ్ తెగమెచ్చేసుకున్నాడు. ఈలోగా గుర్రాలొచ్చాయి. నేను మొదట్లో సరదా పడ్డాను. కానీ ఎక్కాక తెలిసింది. **ఎన్.టి.ఆర్, కృష్ణకుమారి లాగానో, రాజశ్రీ కాంతారావులాగానో 'వగలరాణివి నీవే..' అని పాడుతూ ముందుకీ వెనక్కీ తూగుతూ వెళ్ళినట్లు సరదాగా ఉండదని! (మా అమ్మమ్మ చెప్పనే చెప్పింది వాళ్ళు స్టూడియోలో కొయ్య గుర్రం మీద అలా ఊగుతూ, లాంగ్ షాట్స్‌లో గుర్రాలు చూపిస్తారని!)**

నా గుర్రం పేరు లాలూ, మా ఆయన గుర్రం పేరు నేనీట. లాలూ ఎర్రగా ఉండి చాలా దూకుడు. నేనీ కొంచెం నెమ్మది! సరదాగా మొదలైంది. కొంచెం దూరం వెళ్ళగానే నేను గొల్లున గోల 'నేను దిగిపోతాను. ఇంక చాలు!' అని. అతను మా ఆయన గుర్రాన్ని వదిలేసి నా గుర్రపు తాడు పట్టుకుని పిన్నాదీ.. బైఠియే మేమ్ సాబ్.. మున్నాదీ బైఠియే!' అని గొప్పగా మా భాషలో చెపుతున్నట్లు ఫీలయి మాట్లాడేసాడు.



ఈ గుర్రాలు స్కిడ్ అయిపోతూ, కొండ చివర్లకి వెళ్ళిపోతూ, ఒకదాన్ని ఒకటి తోసుకుంటూ, దార్లో కొత్త గుర్రాలు ఎదురయినప్పుడు ట్రాఫిక్ జామ్‌లు చేస్తూ, కాలకృత్యాలు తీర్చుకుంటూ హడావిడి చేస్తుంటాయి. ఒక్కోసారి జర్రున జారి మళ్ళీ నిలదొక్కుకుంటాయి! ఎలా కంట్రోల్ చెయ్యాలో తెలీక, కాలి దగ్గర ఏక్సిలేటరూ, బ్రేకూ లేక, 'కుయ్యో మొయ్యో'మని అరుస్తుంటాము. దాదాపు అందరం, పైనుండి వస్తున్న వాళ్ళూ, కిందనుండి వెళుతున్న వాళ్ళం ఇదే పనిలో ఉంటాం! **పైన కొండమీదకి వెళ్ళేలోపు ఎన్నిసార్లో భగవంతుడు గుర్తొస్తాడు. ఇల్లూ, పిల్లలూ, తీర్చాల్సిన బాధ్యతలు కూడా గుర్తొస్తాయి.**


నేను కొన్న పూసల నగలు

మొత్తానికి కొండ అంచుకి చేరుకున్నాక, కష్టపడి దిగుతాం. చాలా మంది కుంకుమపువ్వు అమ్ముతామనీ, డ్రైఫ్రూట్స్ అమ్ముతామనీ మనచుట్టూ మూగుతారు. టెలిస్కోప్‌లో నక్షత్ర దర్శనం చేయిస్తాం అంటారు. పైన కాళీమాత గుడి ఉంటుంది. పూజారి మన బొట్టుమీద పుల్లతో సన్నగా ఒక గీత గీస్తాడు. మిస్రీ పెడతాడు ప్రసాదంగా అంతే!

నేను వచ్చాను కదా అని కొన్ని పూసల నగలు కొన్నాను. అక్కడ లోకల్స్ కూడా పూసల నగలు తప్ప, బంగారంలాంటి లోహాలతో కనిపించరు. మా ఆయన చెప్పారు. పెళ్ళి అయితే ఇంకొంచెం పెద్ద పూసలు పెడతారట. అందుకని వాళ్ళ లైఫ్‌లో అసంతృప్తీ, స్థాయి బేధాలు లేక హాయిగా ఉంటాయి అని! కానీ అక్కడ ముఖ్యమంత్రులూ, మన అటల్ బిహారీ వాజ్‌పాయ్ గార్లూ కొని పారేసిన స్థలాలు చాలా కనిపిస్తాయి!

అక్కడ ఒక వేడి టీ తాగి, ఈసారి గుర్రాలని మార్చుకుని కిందకి వస్తుంటే మళ్ళీ చాలా భయం వేసింది!

కిందకి వచ్చేసరికి గౌరవ్ ఓ నిద్రపోయి లేచినట్లు కనిపించాడు. సాయంత్రం మాల్‌కి వెళ్ళాలి. వెళ్ళి రెస్ట్ తీసుకోండి అన్నాడు. మేం లంచ్ చేసి నిద్రపోయాం.

సాయంత్రం గౌరవ్ ఐదుగంటలకి వచ్చి మాల్‌కి తీసుకెళ్ళాడు. ఒక చోట దింపి 'ఇక్కడ లిఫ్ట్‌కి టికెట్ కొనండి. ఒక లిఫ్ట్ దిగి ఇంకోటి ఎక్కి కొండమీదకి వెళితే మాల్ ఉంటుంది. టికెట్ చెరి ఆరురూపాయలు. ఏడున్నర తర్వాత లిఫ్ట్ ఉండదు. నడిచి దిగాల్సి వస్తుంది" అన్నాడు.

మేం వెళ్ళబోతుంటే ఆపి "మేరీలియే గుప్తాజీ ఢాబా సే ఖానాలాయియే! కడీ వహాఁకి స్పెషల్ హై" అన్నాడు.


లిఫ్ట్‌లో పైకి వెళ్ళిన మాల్‌లో

మేం లిఫ్ట్ టికెట్ కొని పైకి వెళ్ళాం. నిజంగా ఒక సినిమా సెట్టింగ్ లాంటి అందమైన దృశ్యం. తీర్చిదిద్దినలాంటి అంగళ్ళూ, రంగురంగుల బట్టలతో టూరిస్టులూ, రకరకాల తినుబండారాలూ, పోస్ట్ ఆఫీస్, ఏటిఎమ్ సెంటర్లు, బ్యాంకులూ, ఆసుపత్రీ అన్నీ ఉన్నాయి. ముఖ్యంగా చెప్పుకోవలసింది ఎనభై, డెబ్బై ఏళ్ళ వృద్ధులు కూడా కర్రపోటు వేసుకుంటూ మెట్ల దారిగుండా మాల్‌కి వస్తున్నారు! అందరూ మేకప్‌లతో, అందంగా ఆరోగ్యంగా కనిపిస్తున్నారు. లిగి, కివీ, సిమ్లా ఆపిల్స్ అక్కడ ప్రత్యేక ఫ్రూట్‌లు. కానీ ఏ హార్ట్ ఎటాక్ అయినా వస్తే ఈ దారిలో ప్రయాణంలోనే అశువులు బాసే ప్రమాదం ఉంది! అంతా కచ్చాదారి!

మేం కొంచెం షాపింగ్ చేసాం. ఒక సర్దార్జీ చేత మా ఐ ఫోన్లో ఫోటోలు తీయించుకున్నాం తర్వాత గుప్తాజీ ఢాబా ఎక్కడో అడిగి వెళ్ళి డ్రైవర్‌కి మీల్ ప్యాక్ చేయించాం. మేం టీ తాగి, పకోడీలు తిన్నాం. గుప్తాజీ ఢాబాలో ఫుడ్ రుచిగా ఉంటుందని అవి తినగానే అర్థం అయిపోయింది. మంచి 'చట్‌పటా' భోజనం. ఎక్కడా చప్పిడి తిండి ఉండదు!

క్రిందకి వచ్చి గౌరవ్ భోజనం హాండోవర్ చేసి, మేం హోటల్‌కి వచ్చి రూంకే రోటీలూ, కూరా తెప్పించుకుని తిని పడుకున్నాం. కానీ నాకు కడీ తినలేదనీ, గౌరవ్ ఊరించిన విషయం గుర్తొస్తూనే ఉంది!

తెల్లవారి, ఎనిమిదిన్నరకలా బ్రేక్‌ఫాస్ట్ చేసి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యపట్టణం, సిమ్లాకి వీడ్కోలు పలికి మనాలీ దారిపట్టాం. మనాలీ కులూ అనే డిస్ట్రిక్ట్‌లో ఉంది. వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడు కూడా అతి పెద్ద టన్నల్‌లో నుంచి అరగంట ప్రయాణం చేస్తాం! లోపలంతా లైట్లతో వెలుతురుగానే ఉంటుంది. చలి పెరిగిపోతూ ఉంటుంది. మఫ్లర్లూ, షాలూ అన్నీ పైకి తీసాం. ఒక గవర్నమెంట్ హాస్పిటల్ తప్ప చండీగఢ్ దాకా ఇంకో పెద్ద హాస్పిటల్ లేదు!

కులూ చేరేటప్పటికి సాయంత్రం ఐదు అయింది.

శ్రీరామ్ టెక్స్‌టైల్స్ అనే ఒక సర్దార్జీ షాప్ దగ్గర ఆపి గౌరవ్ "ఏవైనా ఉలెన్స్ కొనాలనుకుంటే కొనండి" అన్నాడు.

మేం కొన్ని షాల్స్, స్వెట్టర్లూ కొన్నాం. రేట్లు చాలా రీజనబుల్‌గా అనిపించాయి. నేను అర్జెంటుగా స్వెట్టర్ వేసేసుకుని, తలకి స్కార్ఫ్ కట్టేసుకున్నాను.

మాకు మనాలీలో ఇచ్చిన హోటల్ దిపార్క్. అది ఊరికి దూరంగా ఉందని గౌరవ్ చెప్పాడు. ఊరంతా వ్యాస్ నది పారుతూనే ఉంటుంది. ఊరంతా కలిపి కొండపైకి వెళ్ళడం, కొండ కిందకి దిగడం అంతే. వాజ్ పాయ్ గారి విలాసమందిరం, ఫార్మ్ హౌస్ ఉంది అక్కడ.

జనవరి నెలలో అయితే ఈ లోయలో ఉన్న డిపార్క్ హోటల్ మంచుతో కప్పబడిపోతుంది. ఊరంతా మంచే ఉంటుంది. మీరు ఎక్కడికో వెళ్ళి మంచు చూడాల్సిన అవసరం రాదు అని గౌరవ్ కబుర్లు చెపుతూనే ఉన్నాడు.

అతి పెద్ద ఆ స్టార్ హోటల్‌లో సిబ్బంది అంతా ఫుల్ సూట్స్‌లో టీ.వీ చూస్తూ కనిపించారు. ఇక్కడ మా రూం నెంబర్ టూట్వెల్వ్. మాకు లగ్జరీ సూట్ ఇచ్చారు.

ఇక్కడ డిన్నర్ బఫే పెట్టారు.

ఓ డజన్ జంటలు కనపడ్డాయి. వెజ్, నాన్ వెజ్ అన్నీ ఉంటాయి. బైగన్ కా బర్తా చాలా బావుంది!


వ్యాస్ నది ప్రక్కన

రూంలోకి వచ్చాక, నేను ‘ఆ ఏ.సీ కట్టేయండి.. చలికీ శబ్దానికీ చస్తున్నాం‘ అన్నాను. ‘ఏ.సీనా ఎక్కడా?‘ అన్నారు మా వారు. ఇద్దరం శోధిస్తే, బాల్కనీ తలుపు కనిపించింది. తీస్తే వ్యాస్ నది భీకరంగా అరుస్తూ రాళ్ళని ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది! ఇదా అల్లరి.. అని తలుపు మూసేసాం. నాకు చలికి పళ్ళు కటకటలాడుతున్నాయి. ఇంక జనవరిలో ఎలా ఉంటుందో తలుచుకుంటే భయం వేసింది.

ప్రొద్దుట బ్రేక్ ఫాస్టు చేసి రోతాంగ్ బయలుదేరాం. మా గౌరవ్ కొన్ని స్థల మహత్యాలు చెప్పాడు.

"ఇది రాక్షస రాజ్యం! హిడింబి వీళ్ళ దేవత. మాలాంటి బయట డ్రైవర్లతో పోట్లాట పెట్టుకుంటారు ఈ లోకల్స్. ఉన్నదంతా లూటీ చేసి పంపిస్తారు. పాపభీతి తక్కువ! జాగ్రత్తగా ఉండండి" అని భయపెట్టాడు.

నిజంగానే ఎక్కడ చూసినా ‘మా హడింబ ట్రాన్స్‌పోర్ట్‘, ‘మా హడింబ షోరూం‘, ‘మా హడింబలాడ్జ్‘ అని బోర్డ్స్ కనిపిస్తాయి.




‘ఓహో అలనాడు ఆ భీమసేనుడ్ని హిడంబి ఇక్కడే కదా ప్రేమలో పడేసి పెళ్ళాడిందీ అనుకోగానే ‘ఛాంగురే బంగారూ రాజా‘ అని పాట గుర్తొచ్చింది!

మా గౌరవ్ మాతో "లోకల్ డ్రైవర్స్ మమ్మల్ని రోతాంగ్ వరకూ పైకి రానివ్వరు. కాబట్టి ఇంకో డ్రైవర్ని చూసాను అతని పేరు రోహన్" అన్నాడు. రోహన్ వచ్చి మా హోటల్ దగ్గర మమ్మల్ని పికప్ చేసుకుని ఒక షాప్ దగ్గర ఆపాడు. అక్కడ మా వారి దగ్గర వాళ్ళు ఐదువేలు తీసుకుని స్కీయింగ్‌కి కావల్సిన సరంజామా, మాకు కిందనుండి పైకి వేసుకునే బట్టలూ, గమ్ బూట్స్ అద్దెకు ఇచ్చారు. వెంట ఒక గైడుని కూడా పంపారు.


మౌంటెన్ బైక్

అక్కడనుండి మాకు క్షణక్షణం ప్రమాదపు అంచుల్లో పయనించటం అంటే అర్థమయింది. కొండపైకి వెళ్ళేదారి చాలా నేరోగా, ఇరుగ్గా ఉంది. ఇరుకు బాటలో, ఎదురుగా వచ్చే వాటికి సైడ్ ఇవ్వడం, ఒక పక్క కొండ చరియల్లో పని చేసే కూలీలూ, రోడ్డు బాగుచేసే మిల్లర్లూ, మా డ్రైవర్ సడెన్ బ్రేకులూ, గతుకుల కచ్చా రోడ్డూ అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని కూర్చున్నాం.

కిటికీ అద్దాలు తీస్తే చలికి కొంకర్లు తిరుగుతున్నాం. అక్కడ పని చేస్తున్న ఆడామగా కూలీలని చూస్తుంటే, వాళ్ళు నిర్భయంగా కొండ అంచులకెళ్ళి నిలబడడం చూస్తుంటే, నాకోటి

అనిపించింది. బహుశా వీళ్ళు ఇంటినుండి పనికి వచ్చేటప్పుడు 'నేను తిరిగి వస్తే భోజనం వండు. లేకపోతే లేదు' అని చెప్పి వస్తారేమో!" అంత గ్యారంటీ లేదు వీళ్ళ జీవితాలకి అనిపించింది.

ఇంకొంచెం వెళితే రోతాంగ్ వస్తుంది అన్నప్పుడు మా డ్రైవర్ ఆపేసి "ఇంకా పైకి వెళ్ళాలంటే, గుర్రం కానీ మౌంటెన్ బైక్ కానీ ఎక్కండి" అన్నాడు.

మేం మొహాలు చూసుకున్నాం. ఆ మంచులో బైక్ మీదా.. గడ్డకట్టిపోతాం! గుర్రం అనగానే ఈ దారిలో... పై ప్రాణాలు పైనే పోయాయి!

పక్కనున్న గైడ్ తన పని తాను మొదలు పెట్టాడు. 'ఈ డ్రైవర్‌కే ఇంకో వెయ్యి ఇవ్వండి.. పైకి తీసుకెళతాడు' అన్నాడు. అప్పుడు మాత్రం పైకి ఎలా తీసుకెళతాడు' అన్నాడు. అప్పుడు మాత్రం పైకి ఎలా తీసుకెళతాడు? అని అడిగాం. 'రిస్క్ తీసుకుంటాడు' అన్నాడు. నేను భయంగా చూసాను. మా ఆయన వెయ్యి ఇవ్వడానికి ఒప్పుకున్నారు.

కారు ముందుకి వెళ్ళడానికి బదులు వెనక్కి వెళుతోంది. అంది మంచుమీద జారిపోతోందని మాకు అర్థమయింది.



మిలట్రీ వాళ్ళు ట్రక్కుల టైర్లకి, కొంచెం గాలి తీసేసి, బార్బ్‌డ్ వైరు లాంటి ఫ్రేమ్ చుట్టి మంచుకోసేస్తూ డ్రైవ్ చేస్తారుట. మా కారుమాత్రం ముందుకి వెళ్ళనని మొరాయించింది. మేం దిగి నడక మొదలు పెట్టాం.

**నేను దిగి స్టిక్ మంచులో గుచ్చి నడుస్తుంటే, మన సినిమా హీరో హీరోయిన్ల మీద విపరీతమైన గౌరవం పెరిగిపోయింది. ఈ చలిలో అడుగు తీసి అడుగు వెయ్యడమే కష్టం అలాంటిది పాపం, పాటలు పాడుతూ స్టెప్పులు వెయ్యడం.. పైగా ముఖంలో ఆనందంగా ఉన్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడం.. ఇవన్నీకాక కురచబట్టలు! ఒక్కసారిగా అమ్మమ్మ నన్ను అబద్ధాలతో మోసం చేసిందనీ, వాళ్ళు డాన్స్ చేసేది నిజం మంచులోనే అనీ నాకు అర్థమయింది!**

మా ఆయన స్కీయింగ్ చెయ్యడానిక్ ట్రై చేస్తున్నారు. నేను ఆ ప్రయత్నాలు చెయ్యకుండా హాయిగా నా చిరకాల వాంఛ తీర్చుకుంటూ, మంచు ఉండలు చేసి మా ఆయన్ని కొట్టాను. ఆయన అసలే స్కీయింగ్ బాలెన్స్ చెయ్యలేకపోతుండడంతో ఇరిటేట్ అయిపోయి 'నీకూ డబ్బులు కట్టాను. నువ్వూ వచ్చి చెయ్యి. నన్ను మంచుతో కొట్టడం కాదు!" అన్నారు.




నేను వెళ్ళి కాసేపు స్కీయింగ్ చేసినట్లు ఏక్ట్ చేసి ఫోటోలు మాత్రం తీయించుకున్నాను. ఇంతలో 'యాక్స్' వచ్చాయి. వాటితో ఫోటో తీయించుకోడానికి వందరూపాయలు ఇచ్చాం. ఎంతోమంది రోడ్డుమీద కారు దిగి జారిపడిపోవడం చూసాం. మేం వెళ్ళి కారులో కూర్చుని వెళ్ళిపోదాం అన్నాం. రోహన్ ఎంతో ట్రై చేసి, ఇంకో ఇద్దరి సాయంతో కారు వెనక్కి తిప్పాడు. ఈలోగా రోహన్ కొన్ని ఫోటోలు కూడా తీసాడు. వెంట వచ్చిన గైడ్ స్నో ఎఫెక్ట్ కోసం తలల మీద స్నో పౌడర్ చేసి జల్లాడు. అతను తీసిన ఫోటోల్లో మా మొహాలే క్లియర్‌గా రాలేదు. ఇంక స్పెషల్ ఎఫెక్ట్స్ ఏం వస్తాయి? సాయంత్రం హోటల్‌కి వచ్చేటటికి ఒళ్ళు అలిసి పులుసుకూర అయిపోయింది. లంచ్ స్కిప్ చేసి, టీ స్నాక్స్ తెప్పించుకుని తిని నిద్రపోయాం.



సాయంత్రం రెస్టారెంట్‌లో బఫేకి వెళితే మేనేజర్ ఫుడ్ ఎలా ఉందని అడిగి ఎక్కడినుండి వచ్చామో తెలుసుకున్నాడు. అతని పేరు హసన్ ఒకప్పుడు బాక్సింగ్ ఛాంపియన్‌ట. బాక్సింగ్ కోసం హైదరాబాద్ ఓసారి వచ్చాను. బిరియానీ చాలా బావుంటుందని చెప్పాడు.

మరునాడు ఉదయం బ్రేక్ ఫాస్ట్ దగ్గర కొత్తగా పెళ్ళైన ఒక అమ్మాయి, అబ్బాయి కనిపించి "మీరు తెలుగువాళ్ళా" అని పలకరించారు. వాళ్ళు బెంగుళూరు నుండి వచ్చారు. వాళ్ళు అందరూ తమని చీట్ చేస్తున్నారని చెప్పారు. ఆ అమ్మాయి స్వాతి అయితే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. వాళ్ళని వాళ్ళ డ్రైవర్ ఎక్కడో దారి తప్పించేసాడుట. ఎవరికో చూపించి వీళ్ళ గురించి ఏమేమో చెప్పాడుట. అస్సలు పాపులర్ కాని ఊరి చివరి గుడికి తీసుకెళతానని పట్టుబట్టాడట. దాంతో ఈ అబ్బాయి తనకి ఒంట్లో బాలేదని ఏక్ట్ చేసి రూంకి వచ్చేసాడుట. ఇదంతా చెప్పి 'మాకు భయంగా ఉంది. ఎవర్ని నమ్మాలో తెలీడం లేదు మేం వెళ్ళిపోతాం' అన్నారు. నేను వాళ్ళకి చాలా ధైర్యం చెప్పాను. వాళ్ళు చాలాసేపు మాతో మాట్లాడుతూ ఉండిపోయారు.

ఆ రోజ్ మేం హిడింబ టెంపుల్, వసిష్ఠా టెంపుల్, మాల్, వనవిహార్ చూడాలి.


బొచ్చుతో ఉండే కుందేలు

'చింగూ దేళ్లియే ప్లీజ్' అంటూ మనని జనం వెంటపడి వేధిస్తారు. చింగూ అంటే రజాయిలాంటిది. చలి ఆగడానికి కప్పుకునేది. వాళ్ళే పార్సిల్ చేస్తారు మనం ఎడ్రెస్ ఇస్తే. అక్కడ బోలెడు బొచ్చుతో ఉండే కుందేళ్ళు ఉంటాయి వాటిని ఎత్తుకుని ఫొటో తీయించుకోవాలంటే యాభైరూపాయలు ఇవ్వాలి.

వశిష్ఠా టెంపుల్ లో స్నానకుండ్‌లో భూమిలోంచి వేడి వేడి నీటి ఊట వస్తుంటుంది. మామూలు వేడికాదు, ఆ మంచులో మరుగుతున్న నీళ్ళు! అది ప్రకృతిలో వింత! ఆడవాళ్ళకీ మగవాళ్ళకీ ప్రత్యేకమైన స్నానకుండ్‌లు ఉన్నాయి.


హిడింబ గుడి

హిడింబ గుడిలో, కింద గుహలో హిడింబ ప్రతిమ ఉంటుంది. అక్కడ మనసులో కోరికలు చెప్పుకుని దణ్ణం పెట్టుకున్నాం. తరువాత వనవిహార్ కెళ్ళాం. మాల్‌లో చిన్న షాపింగ్ చేసాం. లాడ్జిలు తప్ప భోజనం దొరికే హోటల్ లేదు మనాలీలో. మంచు ఊరిని కప్పేసినప్పుడు ఇళ్ళలోంచి బయటికి రాకుండా వీళ్ళు ఎలా బ్రతుకుతారో పాపం అనిపించింది. చాలా వరకూ రోజువారీ వ్యాపారస్తులే! ఆ మరునాడే మేం మనాలీ నుండి చండీగఢ్ బయల్దేరిపోయాం. మన పాంచాలి పుట్టిన ప్రదేశం.


రాక్ గార్డెన్

రెండు రాష్ట్రాల రాజధానిలో, రెండు అసెంబ్లీలు ఒకదాని వెనక ఒకటి చూస్తాం! ప్లాన్‌డ్ సిటీ. ఎంతో అందంగా ఉంటుంది. దారిలో మా డ్రైవర్ ఒక ఢాబా దగ్గర భోజనానికి ఆపాడు. అక్కడ పక్కన ఓ స్కూల్, చిన్న స్టేజ్ వేసి పిల్లల చేత డాన్సులు చేయిస్తున్నారు. ఓ ఇరవై, పాతిక మంది తల్లితండ్రులు కెమేరాలతో ఫోటోలు తీస్తూ ఆ కొండల మధ్య ప్రశాంతంగా కనిపించారు! ఎటువంటి శబ్దాలూ, కాలుష్యం లేని హిమాచల్ ఒడిలో ఆనందంగా కనిపించారు.

చండీగఢ్‌లో సిటీ హార్ట్ హోటల్‌లో ఉన్నాం. వాళ్ళు డిన్నర్, రూఫ్ గార్డెన్‌లో అరేంజ్

చేసారు. ఇక్కడ రూం నెంబర్ 205. ప్రొద్దుట బ్రేక్ ఫాస్ట్ చేసి, రాక్ గార్డెన్, లేక్ చూడ్డానికి వెళ్ళాం.

20 రూపాయలు టికెట్. లోపల మనం వాడిపారేసిన పేస్టు ట్యూబులూ, పాతడ్రమ్ములూ, ఫ్యూజులూ, విరిగిన రాతి తిరగళ్ళూ, రోళ్ళూ అన్నీ అక్కడ వాడి బోలెడు బొమ్మలు చేస్తారు. నా చెప్పు తెగితే అక్కడే వదిలేసి వచ్చాను. బహుశా వాటిలో నెక్స్‌ట్ టైం వెళ్ళేసరికి ఏ అందమైన అమ్మాయి బొమ్మో చేసి పెడతారేమో!

మొత్తం చుట్టిరావడానికి గంట పట్టింది.

ఢిల్లో రావడానికి దారి పట్టాం. మళ్ళీ హవేలీలోలంచ్. అదే దారిలో రావడం వల్ల ఎక్కడెక్కడ ఆగాలో మాకు తెలిసిపోయింది. **దోశా విత్ కలర్ వాటర్ తిన్నాం (మా ఆశ్విన్ ఫ్రెండ్ అమిత్ అమెరికాలో సాంబారుకి పెట్టిన పేరు).** మా ఫ్లైట్‌కి మూడుగంటల ముందు ఢిల్లీ ఎయిర్ పోర్ట్ చేరాం. గౌరవ్‌కి పదిహేనువందలు టిప్ ఇచ్చాకా "అగ్లీ బార్ హమారా గాడీ మే అమృత్ సర్ జాయింగే మేడం.. ఫోన్ పర్ ఉన్‌కా ప్రబంధ్ హోజాయేగా" అని నవ్వాడు.


గౌరవ్

నెలలో దాదాపు ఇరవైరోజులు కొండలలో తిరుగుతూ కుటుంబాన్ని పోషించుకునే ఆ కుర్రవాడికి భార్యా, ఇద్దరు పిల్లలూ, ఇద్దరు కాలేజ్‌లో చదువుకునే తమ్ముళ్ళూ ఉన్నారు. మొహం మీద నవ్వూ, గొంతులో రాగం చెరిగిపోనివ్వకుండా అన్నన్ని గంటలు కారు డ్రైవ్ చేసే అతనికి ఆ దేవుడు అంతా మంచి చెయ్యాలి.

మన దేశ రాజధానీ, హర్యానా, పంజాబ్‌ల రాజధానీ, హిమాచల్ ప్రదేశ్ రాజధాని చూసి మా రాష్ట్రరాజధానికి చేరుకుంటుంటే, ఇక్కడ కూడా రెండు విధాన్ సభలు త్వరలో చూస్తామేమో అనిపించింది!

**ఆనందం మన తోటలో నిమ్మచెట్టు మీద వాలే పాలపిట్టలా ఐదు నిమిషాలే ఉంటుంది. కానీ దాన్ని కెమేరాతో బంధిస్తే కలకాలం ఉంటుంది.**

**ఈ జ్ఞాపకాలన్నీ పిల్లలు పెద్దయ్యాక మేం ఇద్దరమే వెళ్ళి మా మస్తిష్కాలలో బంధించి పట్టుకొచ్చాం. ‘మై మామ్ అండ్ డాడీస్ అనదర్ హనీమూన్‘ అని మా చిన్నవాడు ఫేస్ బుక్‌లో పెట్టాడు.**

**హనీమూన్‌కి వయసూ, సమయం అవరోధాలు కాదు! ఇవి మన నిత్యజీవితానికి ప్రకృతి ప్రిస్క్రైబ్(prescribe) చేసే టానిక్కులు!**

I have to go many miles…. Before I sleep.


డోమినోస్ పిజ్జాలో గౌరవ్ తో మా వారు

Click here to share your comments on this serial


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
సాహితి
ప్రచురణలు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
సాహితి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి